
సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



నమో నారసింహ.. నమో భక్తపాల

పెంచలకోన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పౌర్ణమి తులసి దళార్చన సేవ వేడుకగా జరిగింది.

- 8లో



తిరువణ్ణామలై యాత్ర వెళ్లి వస్తూ..

కుప్పం మండలం వెండగంపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు

- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	24
తిరుపతి	35	26
తిరుమల	31	21
గూడూరు	37	27
నగరి	35	25

కుంకీ సక్సెస్

మూడు రోజుల పాటు ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేసిన ఒంటరి మదపుటేనుగు చిక్కడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. మదపుటేనుగును పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు చేపట్టిన 'ఆపరేషన్ కుంకీ' విజయవంతమైంది. దాదాపు 20 గంటల పాటు కొనసాగిన ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో 70 మంది ఆంధ్ర, తమిళనాడుకు చెందిన అటవీశాఖ యంత్రాంగం పాల్గొంది. బంధించిన ఒంటరి ఏనుగును తిరుపతి జూ పార్కుకు తరలించడంతో విషాదంతో మొదలైన ఈ ఘటన.. సుఖాంతమైంది.

మదపుటేనుగును లాక్కెళుతున్న కుంకీలు



తరలింపునకు శ్రమించారు..

వ్యాన్‌లోకి ఏనుగును ఎక్కిస్తున్న అధికారులు

అటవీశాఖ అధికారులు బంధించిన ఏనుగును అటవీప్రాంతానికి తరలించేందుకు గంటన్నర పాటు శ్రమించారు. తొలుత జేసీబీలు తెప్పించి గుంత తవ్వారు. తర్వాత గుంతలోకి వాహనాన్ని దింపి ఏనుగును ఎక్కించే ప్రయత్నం చేశారు. జేసీబీ సాయంతో గుంతలో నుంచి బండి పైకి లాగారు. బండి ఎక్కిన తర్వాత ఏనుగు కాళ్లను గొలుసుతో కట్టి పకడ్బందీగా తిరుపతి జూపార్కు తరలించారు.

- మదపుటేనుగును బంధించిన అటవీశాఖ
- అడుగడుగునా అడ్డంకులు అధిగమించి.. ఆపై బంధించి
- సహకారం అందించిన తమిళనాడు అటవీ యంత్రాంగం
- భీకరి' చిక్కడంతో ఊపిరి పీల్చుకున్న సరిహద్దు ప్రజలు
- తిరుపతి జూ పార్కుకు గజరాజు తరలింపు

చిత్తూరు రూరల్/గుడిపాల: రెండు రోజుల పాటు గజగజలాడించిన ఒంటరి ఏనుగును అటవీశాఖ అధికారులు గురువారం చాకచక్యంగా పట్టుకున్నారు. బుధవారం ఉదయం గుడిపాల మండలంలో బీభత్సం సృష్టించి దంపతులను చంపి.. మరో వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన విషయం విధితమే. దీంతో రంగంలోకి దిగిన అటవీశాఖ అధికారులు బుధవారం రాత్రి కుంకీ ఆపరేషన్‌ను మొదలుపెట్టారు. కుంకీల(రామకుప్పం మండలం ననియాల ట్రైనింగ్ సెంటర్ నుంచి వచ్చిన ఏనుగులు జయంతి, వినాయక)తో పాటు 12 మంది ట్రాకర్స్, 40 మంది అటవీశాఖ అధికారులు, మరో 10 మంది తమిళనాడు అటవీశాఖ అధికారులు, 10 మంది శ్రీవేంకటేశ్వర జూపార్కు సిబ్బంది ఏనుగును వెంబడించారు. బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఆపరేషన్ ప్రారంభమైంది.

ఆపరేషన్ సాగిందిలా..

190 రామాపురం ప్రాంతంలో ప్రారంభమైన ఆపరేషన్ అరుల్‌పురం, పేయనపల్లి, శెట్టిన్‌తంగాల్, చీలాపల్లి మీదుగా బుధవారం అర్ధరాత్రి 2 గంటల వరకు సాగింది. అటవీ ప్రదేశమంతా చీకటిగా ఉండడంతో ఏనుగు జాడ కనిపించలేదు. అర్ధరాత్రి 2.30 నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు చిత్తూరు మండలం పోతురాజులపల్లె, తాళంబేడు ప్రాంతాల్లో జల్లెడ పట్టారు. తెల్లవారు జామున 5.10 గంటలకు తమిళనాడు రాష్ట్రం పెరియబోడి నత్తం గ్రామంలోకి వెళ్లిన ఒంటరి ఏనుగు మహిళను తొండంతో తొక్కి చంపేసినట్టు సమాచారం అందింది. అక్కడి నుంచి ఏనుగు గుడిపాల మండలంలోని 197 రామాపురం వైపు మళ్లింది. ఆప్రాంతంలో ఓ ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేసింది. ఈవిషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు తాళంబేడు నుంచి 197 రామాపురానికి పరుగులు పెట్టారు. అక్కడికి 9 గంటలకు చేరుకున్న అధికారులు ఏనుగు జాడను కనిపెట్టారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా చెరుకుతోటలో తలదాచుకున్న ఒంటరి ఏనుగును కుంకీల సాయంతో తిరుపతి జూ పార్కు డాక్టర్ అరుణ్ 3 గంటలకు మత్తు ఇంజక్షన్ వేశారు. ఆ తర్వాత నెమ్మదిగా అడుగులు వేస్తూ.. కొంత దూరంలో ఏనుగు కిందపడిపోయింది. మత్తులో నుంచి తేరుకోవడానికి డాక్టర్లు మరో ఇంజక్షన్ ఇచ్చారు. ఆపై కుంకీల సాయంతో వ్యాన్ ఎక్కించేందుకు లాక్కెళ్లారు.

రాత్రంతా జాగరణ

గజ సంచారంతో గుడిపాల, చిత్తూరు మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు బుధవారం రాత్రంతా జాగరణ చేశారు. ముందస్తుగా ఏనుగు సంచారం ఉన్న గ్రామాల్లో అధికారులు దండోరా వేయించారు. ప్రజలను అప్రమత్తం చేయించారు. యువకులు, పెద్దలు టపాసులు పేల్చుతూ ఊర్లకు కాపలా కాశారు.

బాధిత కుటుంబానికి సాయం

చిత్తూరు కలెక్టరేట్ : ఒంటరి ఏనుగును పట్టుకునేందుకు నిర్వహించిన ఆపరేషన్ గజ విజయవంతం అయినట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఒంటరి ఏనుగు దాడిలో దంపతులు మరణించడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరుపున రూ.10 లక్షలు సాయం చేసి ఆదుకున్నట్లు తెలిపారు.



197 రామాపురం వద్ద ఏనుగు జాడను పరిశీలిస్తున్న అటవీ అధికారులు, పోలీసులు



197రామాపురంలో ధ్వంసమైన ద్విచక్రవాహనం



ఏనుగుదాడిలో మృతి చెందిన తమిళనాడుకు చెందిన మహిళ

అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు..



వెంకటేష్, సెల్వి మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, డీఎఫ్ఓ

ఒంటరి ఏనుగు సృష్టించిన విధ్వంసంలో ప్రాణాలు కోల్పోయిన 190–రామాపురానికి చెందిన దంపతులు వెంకటేశ్వర్లు(54), సెల్వి (47) మృతదేహాలకు అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు గ్రామానికి వచ్చి మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం సాయంత్రం గ్రామస్తులు, చుట్టుపక్కల నుంచి వచ్చిన ప్రజల అశ్రునయనాల నడుమ అంత్యక్రియలను నిర్వహించారు.

న్యూస్‌రీల్

వినాయకుని సేవలో మంత్రి చెల్లుబోయిన



స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ దర్శించుకున్నారు. గురువారం ఉదయం ఆయన కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వ చనం చేయగా, స్వామి వారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అధికారులు అందించారు. తదుపరి అతిథిగృహంలో ఉండగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. చిత్తూరు వెస్ట్ సీఐ రవి శంకర్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసరావు, ఐరాల తహసీల్దార్ సుశీల, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: జిల్లాలో సెప్టెంబర్ నెలకు సంబంధించి శుక్రవారం నుంచి రేషన్ పంపిణీ ప్రారంభం అవుతుందని ఇన్‌చార్జ్ డీఎస్ఓ శేషాచలంరాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మొత్తం 1,339 చౌక దుకాణాల పరిధిలోని 5,31,019 కార్డులకు గాను 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యం, 50 టన్నుల కంది పప్పు, 25 టన్నుల గోధుమ పిండి, చక్కెర, రాగులు అవసరమైన మేరకు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. కార్డుదారులు రేషన్ పంపిణీ వాహనాల ద్వారా ఇంటి వద్దే సరుకులు పొందవచ్చని ఆయన తెలిపారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి

ఐరాల: మండలంలోని మొరవవడ్డిపల్లె, వినాయకపురంలో బుధవారం రాత్రి నాలుగు ఏనుగులు బీభత్సం సృష్టించాయి. మొరవవడ్డిపల్లెకు చెందిన రైతు బాబు టమాటా పంటను తొక్కి నాశనం చేశాయి. వినాయకపురంలో రైతు సంతోష్‌రెడ్డికి చెందిన మామిడి చెట్ల కొమ్మలను విరిచేసి, రాతి కూసాలను కూలదోశాయి. నాలుగు ఏనుగులు నాంపల్లె అటవీ ప్రాంతం వైపు వెళ్లాయని రైతులు చెబుతున్నారు.

ముగిసిన డాక్యుమెంట్ రైటర్ల సమ్మె

చిత్తూరు కార్పొరేషన్: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయనున్న ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను వ్యతిరేకిస్తూ జిల్లాలోని డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్‌వెండర్స్ చేపట్టిన పెన్‌డౌన్ సమ్మె గురువారంతో ముగిసింది. రైటర్లు, స్టాంప్‌వెండర్స్ చిత్తూరు అర్బన్, రూరల్ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కారించాలని నినాదాలు చేశారు. నాయకులు సీవీ ఆనంద్‌కుమార్, శంకర్‌నారాయణ, రవి, త్యాగరాజన్, హేమచంద్ర, రూపేస్, చందు, చిరంజీవి, శ్రీహరి, ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ



శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కలెక్టర్ షణ్మోహన్ వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవు పెట్టడంతో ఇన్‌చార్జిగా జేసీ శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి పదో తేదీ వరకు షణ్మోహన్ సెలవు పెట్టారు.

యోగా డిప్లొమా కోర్సుకు దరఖాస్తులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా యూనివర్సిటీలో 2023–2024 సంవత్సరానికి సంబంధించి డిప్లొమో ఇన్ యోగా, పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ రజిని తెలిపారు. డిప్లొమా కోర్సుకు ఇంటర్ అర్హతగాను, పీజీ డిప్లొమా కోర్సుకు డిగ్రీ అర్హత ఉండాలని సూచించారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు తోపాటు రిజిస్ట్రార్, పద్మావతి మహిళావర్సిటీ, తిరుపతి పేరు మీద తీసిన రూ.150 డీడీని, సెప్టెంబర్ 30లోపు అందజేయాలని కోరారు. దరఖాస్తులను వర్సిటీ వెబ్‌సైట్ నుంచి లేదా వర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో నేరుగా పొందవచ్చని తెలిపారు.

పున్నమి వెన్నెల్లో కల్యాణ వెంకన్న



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి గురువారం పౌర్ణమి సందర్భంగా రాత్రి గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

క్రీడా స్ఫూర్తిని నింపుదాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్ర రావు

- విద్యార్థుల ఆసక్తి మేరకు ఆయా క్రీడల్లో శిక్షణ ఇవ్వాలి
- నాడు–నేడు కింద మైదానాల అభివృద్ధి
- పీఈటీల సంఘం జిల్లా సమావేశంలో డీఈఓ విజయేంద్రరావు

చౌడేపల్లె: విద్యార్థులు క్రీడల్లో రాణించేలా స్ఫూర్తిని నింపాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్ర రావు సూచించారు. గురువారం మండలంలోని విజయవాణి రెసిడెన్సియల్ స్కూల్ ఆవరణలో పీఈటీల జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. డీఈఓ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో 6,7 తరగతుల నుంచే విద్యార్థుల్లో క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని గుర్తించి ఆయా క్రీడల్లో రాటుతేలేలా శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను జిల్లాలో వంద శాతం సక్సెస్ చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. నాడు–నేడు కింద క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు చేపడుతామని తెలిపారు. పాఠశాలల్లో రెండు క్రీడలకు సంబంధించిన ప్రధాన కోర్టులు ఉండాలని పేర్కొన్నారు. జోనల్స్, ఇంటర్ జోనల్స్ నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా స్థాయిలో 260 మంది పీడీలు, పీఈటీలు సమష్టిగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.

దేశంలోనే మొదటిసారి

ఐపీఈ భానుమూర్తి రాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వ్యాయామ ఉపాధ్యాయుల సేవలను గుర్తించిన ప్రభుత్వం స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సెలెన్సీ అవార్డులను ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. ఒక్కో జిల్లాలో ఐదుగురిని అవార్డులతో సత్కరించి క్రీడా రంగ ప్రోత్సాహానికి నాంది పలికింది ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని తెలిపారు. డీఎస్‌డీఓ బాలాజీ మాట్లాడుతూ సెప్టెంబర్ 15వ తేదీ నుంచి స్పోర్ట్స్ అథారిటీ కిట్లను అందజేసి, 15 ఏళ్ల వయస్సు పైబడినవారందరూ క్రీడల్లో పాల్గొనే కార్యక్రమం రూపొందించినట్లు చెప్పారు. విజయవాణి సంస్థల కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర మూర్తి, డీవైఈఓ కృష్ణప్ప, స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్, ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, పీడీలు రామచంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్స్, ఇంటర్ జోనల్స్ జరిగే ప్రాంతాలను డీఈఓ విజయేంద్రరావు ప్రకటించారు.

జోనల్స్

పూతలపట్టు : యాదమరి హైస్కూల్
చిత్తూరు : చిత్తూరు కణ్ణన్ పాఠశాల
నగరి : నగరి హైస్కూల్
పుంగనూరు : చౌడేపల్లె(విజయవాణి)
జీడీనెల్లూరు: తూగుండ్రం హైస్కూల్
కుప్పం : చిన్నేపల్లె బాలికల హైస్కూల్
పలమనేరు : పలమనేరు జీఎల్ఎస్ ఫారం

ఇంటర్ జోనల్స్

పుంగనూరు, చౌడేపల్లె, విజయవాణి హైస్కూళ్లు

గజ బాధిత కుటుంబానికి అండ

- కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం
- రూ.10లక్షల చెక్కును అందజేసిన ఎమ్మెల్యే, డీఎఫ్ఓ





పెద్దకుమారుడు విక్రమ్, రెండో కుమారుడు రాకేష్‌కు రూ.5 లక్షల చెక్కు అందజేత

గుడిపాల: మండలంలోని 190 రామాపురంలో ఒంటరి ఏనుగు దాడిలో ప్రాణాలు కోల్పోయిన దంపతులు వెంకటేష్, సెల్వి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా అటవీశాఖ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం వెంకటేష్, సెల్వి మృతదేహాలను సందర్శించి ఎమ్మెల్యే, డీఎఫ్ఓ పూలమాల వేసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం వెంకటేష్ కుమారులైన విక్రమ్, రాకేష్‌కు చెరో రూ.5లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏనుగు దాడిలో దంపతులు మృతి చెందడం బాధాకరమన్నారు. వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కుమారుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు కూడా అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో చర్చించినట్లు తెలిపారు. జేఎంసీ కన్‌స్ట్రక్షన్‌లో వారికి ఉద్యోగం ఇస్తామని ఆయన తెలిపారు. చైతన్యకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గుడిపాల ప్రాంతంలో ఇప్పటి వరకు ఇటువంటి సంఘటన జరగలేదన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం దహనక్రియల కోసం అదనంగా రూ.20 వేలను ప్రభుత్వం తరపున అందజేశారు. వారితో పాటు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ 2022 జనవరి 6వ నుంచి 2023 జూలై 31వ తేదీ వరకు వివిధ కారణాలతో జాబితాలో తొలగించిన 53,537 పేర్లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. తొలగించిన ఓటర్ల జాబితాను బీఎల్‌వోలకు పంపినట్లు తెలిపారు. ఆ జాబితాలోని పేర్లను ఏకారణంతో తొలగించారో పరిశీలించి ఫారం 7 సపోర్టు డాక్యుమెంట్‌ను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పరిశీలనలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మల్లప్పకొండ కుంభాభిషేకం

పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

గుడుపల్లె: మల్లప్పకొండపై వెలసి ఉన్న శ్రీస్వర్ణగిరి మల్లేశ్వరస్వామి నూతన దేవాలయ మహా కుంభాభిషేకం ఆహ్వాన పత్రికను పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం తిరుపతిలో ఆవిష్కరించారు. గుడుపల్లె జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈనెల 11, 12, 13వ తేదీల్లో మహాకుంభాభిషేకం మహోత్సవాలు జరుగనున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా 13వ తేదీన కొండపై జరిగే మహా కుంభాభిషేకానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఆహ్వానించిన వారిలో సర్పంచ్ అమరనాథ్, వైఎస్సార్ సీపీ నాయకులు, గోవిందన్, యూత్ రవి, విశ్వనాథ్, సంపంగి, తదితరులు ఉన్నారు

కొత్తగా 7,945 పింఛన్ల మంజూరు

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలోని అవ్వా తాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోంది. ఇందుకు గాను వైఎస్సార్ పింఛన్ పథకం కింద ప్రతి నెలా పింఛన్ మొత్తాలను ఒకటో తేదీన ఇళ్ల వద్దనే అందిస్తోంది. ఇప్పటి వరకు 2,59,946 మందికి పింఛన్లు అందిస్తున్నారు. మరికొంత మంది పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నారు. అర్హులైన 7,945 మందికి కొత్త పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో వృద్ధులు 3,407 మంది, చేనేత కార్మికులు ఇద్దరు, వితంతువులు 2,777మంది , వికలాంగులు 1,442 మంది, అభయహస్తం 14 , కల్లుగీత కార్మికులు ఏడుగురు, ఒంటరి మహిళలు 58మంది, మత్స్యకారులు ముగ్గురు, డప్పుకళాకారులు 87మంది, చర్మకారులు ముగ్గురు, కిడ్నీబాధితులు 45మంది, దీర్ఘకాలిక రోగులు 37మంది, చిత్రకారులు 58 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు అయ్యాయి. దీంతో జిల్లాలో మొత్తం 2,67,891 మందికి రూ.23.14 కోట్ల మేరకు పింఛన్ల మొత్తాలను అందించనున్నారు. ఈ మొత్తాలను శుక్రవారం వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే అందజేయనున్నారు.

మంత్రి రోజాకు గంగజాతర ఆహ్వానం



మంత్రి రోజాను ఆహ్వానిస్తున్న జాతర కమిటీ సభ్యులు

నగరి : పట్టణంలో సెప్టెంబరు 12, 13వ తేదీల్లో జరుగనున్న గంగజాతరకు రావాలని జాతర కమిటీ సభ్యులు గురువారం మంత్రి ఆర్కేరోజాను సంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. మంత్రి నివాసానికి విచ్చేసిన వారు మంత్రికి ఫలపుష్పాలు అందజేసి, గంగమ్మ అమ్మవారి పేరుతో తొలిసారిగా సిద్ధం చేసిన కండువాను మంత్రికి కప్పి ఆహ్వానించారు. జాతర నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామ దేవత దేశమ్మ దేవాలయాన్ని రూ.1.20 కోట్ల ఖర్చుతో పునర్నిర్మిస్తున్నందుకు, ఆలయానికి టీటీడీ నుంచి శేష వస్త్రాలు, పూల, విద్యుత్ అలంకరణ, పందిళ్లు తదితర సౌకర్యాలు కల్పించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. దేశమ్మ ఆలయానికి టీటీడీ నుంచి అందజేస్తున్న సేవలను గంగజాతరకు కూడా అందించాలని గ్రామసభలో పెద్దలందరూ తీర్మానించారని, వారి తరపు ప్రతినిధులుగా మీ ముందుంచుతున్నామంటూ విన్నవించారు. స్పందించిన మంత్రి ఆర్కేరోజా టీటీడీ అధికారులతో ఈఅంశంపై చర్చిస్తానని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, జాతరకమిటీ పెద్దలు చిరంజీవిరెడ్డి, జ్యోతిరెడ్డి, సుబ్రమణ్యం, దేశమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుబాబు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉలవల విక్రయాలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

చౌడేపల్లె: రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు విక్రయించాల్సిన ఉలవలను వ్యాపారులకు విక్రయించడంపై వ్యవసాయాధికారి జ్యోతమ్మ గురువారం విచారణ చేపట్టారు. గురువారం 'సాక్షి'లో '600 కిలోల ఉలవలు తినేశారు' శీర్షికన అక్రమాలపై కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జేడీ మురళీ కృష్ణ ఆదేశాలమేరకు చారాల, చౌడేపల్లె ఆర్‌బీకేల్లో విచారణ చేపట్టి పుంగనూరు ఏడీఏ శివకుమార్‌కు నివేదిక అందజేశారు. ప్రత్యేక విచారణ అధికారిణిగా చిత్తూరు ఏడీఏ శ్రీదేవిని నియమించారు.

క్లుప్తంగా

గజ బాధిత కుటుంబానికి రూ.లక్ష సాయం


చెక్కు అందజేస్తున్న టీడీపీ నాయకులు

గుడిపాల: టీడీపీ మండల నాయకుడు గురజాల చెన్నకేశవులనాయుడు తన గురజాల జగన్‌మోహన్ చారిటబుల్ ట్రస్టు తరపున గజబాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని 190 రామాపురంలో గజదాడిలో దంపతులు వెంకటేష్,సెల్వి మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయాన్ని చెన్నకేశవులనాయుడు అందించారు. టీడీపీ నాయకులు దొరబాబు, హేమలత, పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జింకను అప్పగించిన యువకులు

దొరవారిసత్రం: కుప్పారెడ్డిపాళెం ఎస్సీ కాలనీలోకి గురువారం చుక్కల జింక రావడంతో కాలనీ వాసులు కాపాడి ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. జన సంచారంలోకి జింక వచ్చి ఎటూ వెళ్లకుండా అక్కడే ఉండిపోయింది. స్థానికులు దాన్ని పట్టుకుని వెంటనే నేలపట్టు పక్షుల కేంద్రం వన్యప్రాణి విభాగం అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్ఎస్ఓ బాలయ్య, బీటు ఆఫీసర్లు శ్రీనివాసులు, బాలకృష్ణా స్వాధీనం చేసుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు


విజయానందరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన యువకులు

చిత్తూరు రూరల్: చిత్తూరు సంతపేటకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. గురువారం ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. బీవీరెడ్డి కాలనీలోని విజయానంద రెడ్డి కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిను ఆదర్శంగా తీసుకుని చిత్తూరులో విజయానంద రెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరిని ఆలోచించేలా చేస్తున్నాయని, రాజకీయాలతీతంగా ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్నారన్నారని తెలిపారు. ఇందుకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు చెప్పారు. పార్టీలో చేరిన వారిలో సంతపేట యువత రవి విగ్నేశ్వర్, సుబ్రహ్మణ్యం, గోకుల్ యువరాజ్, అరుణ్, వంశీ, రాహుల్, సంజయ్, మనోజ్, భాస్కర్ తదితరులు ఉన్నారు. సంతపేట వైఎస్సార్ సీపీ నాయకులు చామంతి, సురేష్, ప్రకాష్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 71,132 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 26,963 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.06 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,120
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,489
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,800
రిటైల్ వెండి గ్రాము	రూ.78.80

వైభవం.. కోనేటిరాయుని ఊంజల్ సేవ


ఊయలలో సేదతీరుతున్న స్వామి, అమ్మవార్లు

గంగవరం: మండలంలోని కీలపట్లలో టీటీడీ అనుబంధ పుణ్యక్షేత్రం శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవను నేత్రపర్వంగా జరిగింది. శ్రీదేవి,భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబరాలు, విశేష ఆభరణాలు, పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ స్వామి, అమ్మవార్లు ఊయలలో సేదతీరుతుండగా భక్తులు తిలకించి పులకించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించారు. అనంతరం గ్రామోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ పర్యవేక్షకుడు గజేంద్ర, అర్చకులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం


మృతి చెందిన వెంకటస్వామి

గుడుపల్లె: మండలంలోని చిన్నశెట్టిపల్లె వద్ద జాతీయ రహదారిలో గురువారం తమిళనాడు ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు వెంకటస్వామి(40) గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని గుడికొత్తూరు గ్రామానికి చెందిన వెంకటస్వామి ద్విచక్ర వాహనంలో పనుల నిమిత్తం కుప్పం పట్టణంలోకి బయలుదేరాడు. మార్గమధ్యంలో చిన్నశెట్టిపల్లె వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని తమిళనాడు ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొంది. ఈప్రమాదంలో ద్విచక్రవాహనంలో వెళుతున్న వెంకటస్వామి కిందపడి తీవ్రగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీకాంత్ తెలిపారు.

తిరువణ్ణామలై యాత్ర వెళ్లి వస్తూ..


ధ్వంసమైన వాహనాలు

- రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్రగాయాలు
- వ్యాన్‌ను ఢీకొన్న కారు
- క్షతగాత్రులు వి.కోట వాసులు


సంఘటన స్థలంలో క్షతగాత్రులు

కుప్పంరూరల్: కుప్పం మండలం వెండుగంపల్లె వద్ద గురువారం ఉదయం వ్యాన్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు .. వి.కోట పట్టణానికి చెందిన బొరుగుల శంకరప్ప, భార్య రమణి, కోడలు అశ్విని, పక్కింటి మహిళ లతమ్మ హోండా ఐ 10 కారులో తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ కోసం బయలు దేరారు. కారును డ్రైవర్ విక్రమ్ నడుపుతున్నాడు. బుధవారం రాత్రి గిరిప్రదక్షిణ ముగించుకుని గురువారం వేకువ జామున వి.కోటకు తిరుగు ప్రయాణం అయ్యారు. మార్గమధ్యంలో కుప్పం మండలం వెండుగంపల్లె వద్దకు రాగానే కారు ఎదురుగా వస్తున్న టాటా ఏస్ లగేజీ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురు, టాటా ఏస్ డ్రైవర్ రాజ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలకు తరలించారు. కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవగ్రహ పూజలో మంత్రి పెద్దిరెడ్డి దంపతులు



శ్రీ వకుళమాత ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన నవగ్రహాల పూజల్లో రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణలత దంపతులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.
-తిరుపతి రూరల్

వేడుకగా మహా చండీహోమం


మహా చండీహోమంలో టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆలయ చైర్మన్, ఈఓలు

తిరుపతి కల్చరల్: రాఖీ పౌర్ణమి సందర్భంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గురువారం మహా చండీ హోమాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ మండపం వద్ద అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి అర్చకులు శాస్త్రోక్తంగా మహా చండీహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది కిపైగా దంపతులు పాల్గొని హోమ పూజలు నిర్వహించారు. ఉదయం 8.30 నుంచి ఆరంభమైన మహా చండీహోమం 11.45 గంటలకు నిర్వహించిన పూర్ణాహుతితో ముగిసింది. టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మహా చండీహోమంలో పూర్ణాహుతి చేపట్టారు. కార్యక్రమంలో శ్రీతాతయ్యగుంట ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు పీ.ధనశేఖర్, ఎస్.భారతి పాల్గొన్నారు.

అడవిలో ఆవుకు వైద్యం


ఆవుకు అందిస్తున్న పశువైద్యులు

శ్రీరంగరాజపురం: అడవిలో గాయపడిన ఆవుకు సకాలంలో వైద్యం అందించి వెటర్నరీ అసిస్టెంట్ ప్రశంసలందుకున్నారు. ఈ సంఘటన మండలంలోని నల్లపల్లిలో చోటుచేసుకుంది. పాడి ఆవు యజమాని రాధమ్మ కథనం మేరకు.. నల్లపల్లికి చెందిన రాధమ్మ పాడిఆవును తీసుకుని అడవిలోకి మేతకెళ్లింది. అక్కడ మేతమేస్తూ కిందపడిపోవడంతో కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలిసి రైతు భరోసా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ హరి అక్కడికి వెళ్లి ఆవుకు వైద్యం అందించారు. అనంతరం జేసీబీ సాయంతో ఆవును తీసుకొచ్చి, పశు వైద్య వాహనానికి సమాచారం అందించారు.

నమో నారసింహ..నమో భక్తపాల


లక్ష్మీనరసింహుడు, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మిదేవి


స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆది లక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి గురువారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. లోకకల్యాణార్థం స్వామివారికి అత్యంత ప్రీతికరమైన తులసీ దళాలతో తులసీదళార్చన పూజలు చేసినట్లు ఏసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి, ఆంజనేయ స్వామికి ఉదయం సుప్రభాతం, అభిషేకం, లక్ష్మీనరసింహుడికి నిత్యకల్యాణ మండపంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీ ఉత్సవమూర్తులను కొలువు దీర్చి, వివిధ పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం తులసిదళాలతో ప్రత్యేక పూజలు, ఆదిలక్ష్మీదేవికి కుంకుమార్చన సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు సీతారామయ్య స్వామి, పెంచలయ్యస్వామి, అర్చకులు వినోద్‌స్వామి, శశిస్వామి, నాగరాజస్వామి, మల్లికార్జునస్వామి, ప్రసాద్ స్వామి పాల్గొన్నారు.